జాతీయ రహదారులపై జాప్యమొద్దు

- నిర్దేశిత సమయంలోనే భూసేకరణ, పరిహారం పూర్తిచేయండి
- అభివృద్ధి కేంద్రంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే
- భూ సేకరణ పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి
- సత్వర అనుమతుల కోసం కేంద్ర మంత్రులతో త్వరలో భేటీ
- జాతీయ రహదారుల నిర్మాణంపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి భూ సేకరణ, పరిహారం పంపిణీలో జాప్యం చేయకుండా నిర్దేశిత సమయంలోనే పూర్తిచేయాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ), జాతీయ రహదారుల విభాగం (ఎన్‌హెచ్), జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్), రహదారులు, భవనాల శాఖ, అటవీ శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారులకు నెంబర్ల కేటాయింపు విషయంలో సూత్రప్రాయ అంగీకారం తెలుపుతున్నా ఆ తర్వాత ప్రక్రియలో ఆలస్యంపై ఆరా తీశారు.

రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర నిర్మాణానికి సంబంధించి కేంద్రం లేవనెత్తిన ప్రతి సందేహాన్ని కూడా నివృత్తి చేస్తున్నా మళ్లీ కొత్త సమస్యలను ఎందుకు లేవనెత్తుతున్నారంటూ ఎన్‌హెచ్‌ఎఐ అధికారులను సీఎం ప్రశ్నించారు. ఆర్‌ఆర్‌ఆర్‌ను నార్త్, సౌత్ ప్రాజెక్టులుగా చూడొద్దనీ, ఏకకాలంలో రెండింటి పనులు ప్రారంభమయ్యేలా సహకరించాలని కోరారు. అందుకు ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ సౌత్ అలైన్‌మెంట్‌కు వెంటనే ఆమోదముద్ర వేయాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ-అమరావతి-మచిలీపట్నం 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులివ్వాలని ఎన్‌హెచ్‌ఎఐ అధికారులను సిఎం ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో తాము డ్రైపోర్ట్, లాజిస్టిక్, ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య అనుసంధానంతో హైదరాబాద్-విజయవాడ మధ్య 70 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు సరుకు రవాణా సులభతరం అవుతుందని వివరించారు. పీఎం గతిశక్తి, మరే పథకంలోనైనా ఈ రహదారికి అవసరమైన అనుమతులు ఇవ్వడంతో పాటు అలైన్‌మెంట్ ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సమాంతరంగా రైలు మార్గం అడుగుతున్నామనీ, బెంగళూర్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-అమరావతి మధ్య రైలు మార్గం అవసరమనీ, వందేభారత్ సహా ఇతర రైళ్ల రాకపోకలకు అనువుగా ఉంటుందనీ, లాభసాటి మార్గమని సీఎం వివరించారు.

హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో రావిర్యాల-మన్ననూర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఎన్‌హెచ్‌ఎఐ వెంటనే అనుమతులివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. శ్రీశైలం దేవస్థానం, శ్రీశైలం రిజర్వాయర్, టైగర్ ఫారెస్ట్ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారిలో మర్రి చెట్ల తొలగింపునకు సంబంధించి ఎన్జీటీలో ఉన్న కేసు పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించారు. హైదరాబాద్-మంచిర్యాల-నాగ్‌పూర్ నూతన రహదారికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలనే అంగీకరించాలన్నారు.

మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163జి), ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563), మహబూబ్‌నగర్-మరికల్-దియోసుగూర్ (ఎన్‌హెచ్-167) రహదారులకు సంబంధించి భూ సేకరణ, పరిహారం పంపిణీలో జాప్యంపై ఆయా జిల్లాల కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లాల్లోని కేసులన్నింటిపై నివేదిక రూపొందించి వారంలోపు అడ్వకేట్ జనరల్‌తో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించారు. పరిహారం పంపిణీలో ఆలస్యంపై సిఎం ప్రశ్నించగా సిఎఎల్‌ఎ(కాలా) నుంచి నిధుల విడుదలలో జాప్యం ఉందని కలెక్టర్లు వివరించారు. ఈ విషయమై ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు స్పందిస్తూ జాబితాలు అప్‌లోడ్ అయిన వెంటనే నిధులు విడుదల చేస్తున్నామని, కలెక్టర్లు ఆ పనులు త్వరగా చేయాలని సిఎం సూచించారు. ఈ విషయంలో జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. భూసేకరణ, పరిహారం పంపిణీని అక్టోబరు నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సిందేనని నొక్కి చెప్పారు. ఈ విషయంలో అలసత్వం చూపే కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లపై వేటు వేస్తామని హెచ్చరించారు.

జాతీయ రహదారుల నిర్మాణంలో అటవీ, పర్యావరణ శాఖ పెడుతున్న కొర్రీలపైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. 2002 నుంచి 2022 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించారనీ, అందుకే పస్తుతం అనుమతులు ఇవ్వడం లేదని ఫారెస్ట్ సౌత్ రీజియన్ ఐజీ త్రినాథ్ కుమార్ తెలిపారు. దానిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలు సమర్పించాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. అవసరమైనచోట ప్రత్యామ్నాయ భూమిని అటవీ పెంపకానికి ఇస్తామని సీఎం హామీనిచ్చారు. ఈ విషయంలో అవసరమైతే జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌లతో తానే స్వయంగా భేటీ అవుతానని తెలిపారు. నాన్ వైల్డ్ లైఫ్ ఏరియాల్లో వైల్డ్ లైఫ్ మిటిగేషన్ ప్లాన్‌కి అవసరమయ్యే వ్యయం భరించేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ విషయంలో చొరవ చూపి అటవీ అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణకు సీఎం సూచించారు. తమ కార్యాలయ నిర్మాణానికి హైదరాబాద్‌లో రెండెకరాలను కేటాయించాలని ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వారికి భూమిని చూపే ప్రక్రియ ప్రారంభించాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు.

సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వినయ్ కుమార్ రజావత్, ఎన్‌హెచ్‌ఎఐ సభ్యులు (ప్రాజెక్ట్స్) అనిల్ చౌదరి, మోర్త్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఎన్‌హెచ్‌ఎఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ రేటు కంటే మూడు రెట్లు అదనంగా పరిహారమివ్వాలి

- సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి
- త్రిబుల్ ఆర్ భూబాధితులను కలిసి భరోసా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధర కంటే మూడురెట్లు అదనంగా పరిహారం ఇవ్వాలని సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి, బట్లపల్లి గ్రామాల్లో సోమవారం త్రిపుల్ ఆర్ రైతులను సిపిఎం నాయకులు కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అనేక మంది రైతులు నష్టపోతున్నారని తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూబాధిత రైతుల సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా ఏకమై పూర్తిస్థాయిలో నష్టపరిహారం వచ్చే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రైతులను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య, బండ శ్రీశైలం, మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాయకులు నీలకంఠం రాములు, సల్వోజు రామలింగాచారి, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు, ఏరుకొండ రాఘవేంద్ర, ఆయిల్ కృష్ణయ్య, సిరసనవాడ ఎల్లయ్య, ఊరుపక్క వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఢిల్లీ పీఠాన్ని కదిలించిన.. రైతు ఉద్యమాలను మర్చిపోవద్దు

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ పీఠాన్ని కదిలించిన రైతు ఉద్యమాలను రాష్ట్ర ప్రభుత్వం మర్చిపోవద్దని, పేద రైతుల భూముల జోలికి వస్తే ఐక్యపోరాటాలు నిర్వహిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో సోమవారం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాన్గుల వెంకటయ్య అధ్యక్షతన ఆమనగల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసిత రైతుల అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ రైతులకు రక్షణగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు మద్దతుగా మారాయని అన్నారు. మన భూమి మనకు దక్కే వరకూ రైతులందరూ ఐక్యమత్యంతో ముందుకెళ్లాలని సూచించారు. రాజకీయ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లబ్ది కోసం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం బూర్జువా నాయకులు మతం, కులం పేరుతో విభజించి ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర చేస్తున్నారని అన్నారు. సాగర్ మాట్లాడుతూ భూస్వాముల భూములను కాపాడటం, రియల్ ఎస్టేట్ వ్యాపారుల లబ్ది కోసం ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చిందని తెలిపారు. వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్న సన్న, చిన్నకారు రైతుల భూములను లాక్కోవడం అన్యాయమని అన్నారు. రైతాంగం తలుచుకుంటే ప్రభుత్వాలే కూలిపోయిన చరిత్ర ఉందని ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు దుబ్బాక రామచందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.అంజయ్య, రైతు సంఘం నాయకులు ఎమ్.యాదయ్య, గుమ్మడి కురుమయ్య, పిప్పళ్ళ శివశంకర్, భూ నిర్వాసితుల పోరాట కమిటీ అధ్యక్షులు దొడ్డి పరమేష్, నాయకులు వెంకటస్వామి, పబ్బతి శ్రీను పాల్గొన్నారు.

బుర్ర కథను కళగా ప్రాచుర్యం కలిగించిన నాజర్

ప్రజాశక్తి కల్చరల్

బుర్ర కథకు కళగా గౌరవం గుర్తింపు తెచ్చిన వారు నాజర్ అని ప్రముఖ జర్నలిస్ట్ హాస్య అవధాని శంకర నారాయణ అన్నారు.

తన గంభీర గళంతో వేలాది శ్రోతలను ముగ్ధులను చేసి ప్రజ ను చైతన్య పరచిన అద్భుత బుర్ర కథ కళా కారుడు నాజర్ అని ఆయన చెప్పారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై పద్మశ్రీ పురస్కార గ్రహీత బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ జయంతి సభ త్యాగరాయ గాన సభ నిర్వహణలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్ నారాయణ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన నాజర్ కు మంచి స్వరం వరంగా వచ్చింది అన్నారు. అయన తొలి రోజుల్లో భిక్షాటన కూలీ పనులకు వెళ్లి సంగీతంలో శిక్షణ పొందారని చెప్పారు. హేతు వాది ఇన నాజర్‌కు కమ్యూనిస్టు పార్టీ ప్రజా నాట్య మండలి వేదికలు కల్పించి అయన బుర్ర కథలకు ప్రాచుర్యం కల్పించారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నాజర్ కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించి అయన పట్ల తమ గౌరవం ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ నాజర్ కుమారుడు కళా రత్న షేక్ బాపూజీ, తెలంగాణ బుర్రకథ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండి రాజుల శంకర్, సాలం కష్ణయ్య, సభ్యుడు ఎడ్ల ప్రేమేందర్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను అరికట్టేందుకే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- చట్టాలపై విస్తృత ప్రచారం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ప్రభుత్వాని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రజనీకాంత్, టి నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. మేడ్చల్ జిల్లా పోచారం లోని సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థి జాదవ్ సాయితేజ సెల్ఫీ వీడియో తీసీ సీనియర్లు వేధించారనీ, డబ్బులు కోసం ఒత్తిడి చేయడంతో ఆ విద్యార్థి చనిపోయాడని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్ నిరోధక కమిటీలు వేయకుండా, కనీస పర్యవేక్షణ లేకుండా వ్యవరిస్తున్న కళాశాలలు గుర్తింపు రద్దుచేయాలని పేర్కొన్నారు. డోనేషన్లపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల సంక్షేమంపై లేదని తెలిపారు. రాష్ట్రంలో ర్యాగింగ్ భూతం తరిమికోట్టె విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్ నిరోధక చట్టాలను పకడ్బందీగా అమలు చేసి అవగాహన సదస్సు ద్వారా విద్యార్థులలో విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సిఎం ఇంటిని ముట్టడిస్తాం

- ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూమి జోలికొస్తే ఖబర్దార్
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- రీజనల్ రింగ్ రోడ్డు భూబాధిత రైతులతో ములాఖత్

చావనైనా చస్తాం.. మా భూములను వదలం : రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రీజనల్ రింగ్ రోడ్ పేరుతో పేదల భూముల జోలికి వస్తే ఖబర్దార్. బలవంతంగా వారి భూములను లాక్కోవాలని చూస్తే సిఎం ఇంటిని ముట్టడిస్తాం' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేదోడి భూముల్లో రోడ్లు, కాలువలు వేస్తే.. ఉన్నోళ్ల భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయని అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో రీజనల్ రింగ్ రోడ్డు కారణంగా భూములను కోల్పోతున్న రైతులతో జాన్‌వెస్లీతో పాటు జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులతో వారు మాట్లాడారు. రైతులు తమ సమస్యలను జాన్‌వెస్లీతో మొరపెట్టుకున్నారు. తమకు అండగా నిలిచి, తమ తరపున ప్రభుత్వంతో పోరాడాలని కోరారు.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల్లో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించేందుకు చేపట్టిన ప్రతిపాదనలతో పేదల బతుకులు ఛిద్రం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డు ప్రతిపాదనలతో ఎక్కువ శాతం నిరుపేదలే తమ భూములను కోల్పోవాల్సి వస్తుందన్నారు. గతంలో చేసిన అలైన్‌మెంట్ ప్రకారమే రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇది పార్టీల సమస్య కాదని, పేదల బతుకుతెరువు సమస్య అని.. 'మన భూములను మనమే కాపాడుకుందాం' అంటూ రైతులకు పిలుపునిచ్చారు.

'చావనైనా చస్తాం.. కానీ మా భూములను మాత్రం వదులుకోం..' అని అయ్యవారిపల్లి గ్రామ రైతులు తేల్చి చెప్పారు. ఎలాంటి సమాచారం లేకుండా రాత్రికి రాత్రే తమ భూములు రీజనల్ రింగ్ రోడ్‌లో పోతాయని నాయకులు చెప్పడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాన్‌వెస్లీతో తమ గోడును వినిపించారు. గతంలో చేసిన డిజైన్ ఆధారంగానే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించాలని, 'అలా కాదని తమ భూముల గుండా రోడ్డు వేయాలని చూస్తే ఎంతటికైనా సిద్ధపడతాం.. ఎర్రజెండా చేయూతతో ఎంత దూరమైనా పయనిస్తాం...' అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎండివిజన్‌కార్యదర్శిఎన్.రాజు,నాయకులు పాల్గొన్నారు.

పార్టీకి మారిన ఎమ్మెల్యేలు మట్టి కరవడం ఖాయం

- అసెంబ్లీ కార్యదర్శి ఆధారాలన్నీ సమర్పించాం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్‌కు, ఆయా నియోజకవర్గాల ప్రజలకు ద్రోహం చేసి పార్టీ మారిన ఎమ్మెల్యేలు మట్టి కరవడం ఖాయమనీ, ఈ విషయంలో స్పీకర్ సరైన నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కె.సంజయ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అన్ని ఆధారాలను అసెంబ్లీ కార్యదర్శికి అందజేశామని తెలిపారు. తాను ఏ పార్టీలో ఉన్నాననే విషయాన్ని స్పీకర్ నిర్ణయిస్తారని కడియం శ్రీహరి సోయి, జ్ఞానంతోనే మాట్లాడారా? అని ప్రశ్నించారు. ఉప ఎన్నికలు రావటం, పార్టీ మారిన ఎమ్మెల్యేలు మట్టి కరవటం ఖాయమని నొక్కి చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ పుట్టకముందే ఫిరాయింపుల చట్టం వచ్చిందన్నారు. ఫిరాయింపులను మొదట ప్రోత్సహించిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. బండి సంజయ్ తిరిగే కార్లు ఏ షోరూంలో కొన్నారో కేటీఆర్ అక్కడే కొన్నారనీ, బండి సంజయ్‌వి చిల్లర మాటలు అని కొట్టిపడేశారు. సెకండ్ హ్యాండ్ కార్లు ఎవరైనా కొంటారనీ, అమ్మేవారు ఎక్కడ తెచ్చారో మాకెలా తెలుస్తుందని ప్రశ్నించారు. బండి సంజయ్ ఏమైనా వాస్కోడిగామానా? కొలంబస్‌నా? అని అడిగారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుర్ర లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ దుర్మార్గం వల్లనే కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటా వచ్చిందన్నారు.దానిపై చర్చించేందుకు ఆధారాలతో వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామనీ, తేదీ ఫిక్స్ చేయాలని సవాల్ విసిరారు.

ర్యాగింగ్... విద్యార్థి ఆత్మహత్య

- నారపల్లి మధు బాయ్స్ హాస్టల్‌లో ఘటన
- కేసు నమోదులో జాప్యం అంటూ పిఎస్ వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్స్ ర్యాగింగ్‌కు బిటెక్ విద్యార్థి బలయ్యాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి నారపల్లిలో జరిగింది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన జాదవ్ సాయితేజ నారపల్లిలోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతూ అక్కడే ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. కళాశాలలో సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్‌తో మనస్థాపం చెందిన సాయితేజ ఆదివారం రాత్రి హాస్టల్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. "సీనియర్‌లు తనను బార్‌కు తీసుకెళ్లి.. వారు మద్యం సేవించి నన్ను బిల్లు కట్టాలని ఒత్తిడి చేశారు" అంటూ సాయి తేజ సెల్ఫీ వీడియో ద్వారా తండ్రికి పంపాడు. సాయిపై దాడి సమయంలో సీనియర్స్‌తో పాటు బయటి వ్యక్తులు కూడా ఉన్నారనేది తల్లిదండ్రుల అనుమానం. కేసు నమోదు చేయడంలో జాప్యం అవుతున్నదని సోమవారం బంధువులు మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్‌నేనా.. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

- టిజి : ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే అనుమతులు
- ఇటలీ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటలీ పారిశ్రామిక వేత్తలను కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆ దేశానికి చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. కాంపోనెంట్ తయారీ, సప్లైచైన్, మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎమ్మార్వో), ఏవియానిక్స్, రాడార్ అండ్ సెన్సార్ సిస్టమ్స్, న్యూ-స్పేస్ అండ్ చిన్న ఉపగ్రహాలు, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ కంపోజిట్స్ తయారీలో తెలంగాణలో ఉన్న అవకాశాలు, అనుకూలతలను మంత్రి వారికి వివరించారు. 'రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు, భారీ ఎంఎస్‌ఎంఇ నెట్‌వర్క్, శక్తిమంతమైన ఆర్‌అండ్‌డి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, అత్యుత్తమ ప్రతిభ గల మానవ వనరులు, సుస్థిర ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలతో కూడిన పటిష్టమైన ఎకో సిస్టమ్ అందుబాటులో ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా టిజి - ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే వేగంగా అనుమతులు ఇస్తున్నాం' అని చెప్పారు. హైదరాబాద్ ఏరోనాటికల్ లిమిటెడ్, డిఆర్‌డిఒ లాంటి కేంద్ర సంస్థలు, టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్, ధ్రువ స్పేస్, స్కైరూట్ స్పేస్, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, జిఇ ఏవియేషన్, ప్రాట్ విట్నీ లాంటి దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయని వారికి వివరించారు. హై ప్రెసిషన్ మెషినింగ్, షీట్ మెటల్, హైడ్రాలిక్ సిస్టమ్స్ వంటి క్లిష్టమైన భాగాలను తయారీ చేసి, అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేయొచ్చని తెలిపారు. విమానాలు, హెలికాప్టర్ల ఇంజిన్ల నిర్వహణలో ఇటలీకి ఉన్న నైపుణ్యం ఇక్కడి డిఫెన్స్, ప్రయివేట్ రంగాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఏవియానిక్స్, రాడార్ సెన్సార్ సిస్టమ్స్‌లో ఇటలీ కంపెనీలకు అపార అనుభవం ఉంది. ఈ రంగానికి చెందిన వస్తువులను ఇక్కడ ఉత్పత్తి చేస్తే దేశ రక్షణ రంగం అవసరాలు తీరడంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేయొచ్చు' అని అన్నారు. ధ్రువ స్పేస్, అనంత్ టెక్నాలజీస్, స్కైరూట్ వంటి హైదరాబాద్ స్టార్టప్‌లు ఇప్పటికే తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాయని గుర్తు చేశారు. 'తెలంగాణ, ఇటలీ' మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటి ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, డిఫెన్స్, ఏరోస్పేస్ డైరెక్టర్ ప్రవీణ్ పిఎ, కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇటలీ ఇన్ బెంగళూరు జియాన్‌డొమెనికో మిలానో, ట్రేడ్ కమిషనర్ అంటోనియెట్టా బక్కానారి, ఇండస్ట్రియల్ ఇంటర్నేషనలైజేషన్, నేషనల్ ఎకానమీ మిషన్స్ సెక్షన్ హెడ్ సిల్వియా సిక్కారెల్లి, ప్రెసిడెన్సీ ఆఫ్ కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్ లూగి రిగ్గియో, మల్టీ లేటరల్ సైంటిఫిక్ డిప్లోమసీ హెడ్ అలెశాండ్రో గార్బెల్లిని, వాన్‌జెట్టి ఇంజనీరింగ్, ఎస్ఆర్ఎల్, లియోనార్డోతో పాటు వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మావోయిస్టు ఉద్యమంలో ముగిసిన 42 ఏళ్ల ప్రస్థానం

- సిరిసిల్ల జిల్లాకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు కదారి సత్యనారాయణరెడ్డి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్ధ శతాబ్దపు సాయుధ పోరాటంలో అగ్రగామిగా ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మావోయిస్టు నేత కదారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస (70) ప్రస్థానం ముగిసింది. సోమవారం ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా అంబుజ్‌గఢ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మరణించినట్టు పోలీసులు ప్రకటించారు. కదారి సత్యనారాయణరెడ్డి తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లికి చెందినవారు. సిరిసిల్లలో పదో తరగతి వరకు చదివి, పెద్దపల్లిలో ఐటిఐ పూర్తి చేశారు. ఆ తర్వాత విప్లవ భావాలకు ఆకర్షితుడై 1983లో పీపుల్స్ వార్‌లో చేరారు. అప్పటి నుంచి ఆయన దళ సభ్యుడి నుంచి మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా అంచెలంచెలుగా ఎదిగారు.

42 ఏళ్లుగా ఇంటికి దూరం

మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లిన తర్వాత సత్యనారాయణరెడ్డి తిరిగి స్వగ్రామానికి రాలేదు. కుటుంబ సభ్యులను కూడా కలవలేదు. తల్లిదండ్రులు మరణించినప్పుడు కూడా చివరి చూపు చూడలేదు. సత్యనారాయణరెడ్డికి ఒక సోదరుడు ఉండగా, ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలో మండల విద్యాధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. కదారి సత్యనారాయణరెడ్డిపై రూ.40 లక్షల రివార్డు ఉంది. ఆయన ఎన్‌కౌంటర్‌లో మరణించిన వార్త తెలియడంతో స్వగ్రామం గోపాల్‌రావుపల్లెలో విషాదం నెలకొంది. ఆయన మృతదేహం కోసం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE JUDGE
FAMILY COURT, ANANTHAPURAMU
F.C.O.P.No.28/2025
Between:
Smt. Kandukuri Renuka, W/o Jagadeesh Kumar D/o Kandukuri Bramhachari, D.No.28-3-866, Nethaji Nagar,Ananthapuramu ...Petitioner
And
Jagadeesh Kumar ...Respondant
Notice to the Respondant
To,
Jagadeesh Kumar, S/o Late Sreenivaslu Chari, Resident of Apartment No. 118 Room No.11, Rajv Gruha Kalpa, RGK Colony, Bandlaguda/Amith Guda, Kesara, Medchal Mandal, Ranga Reddy District, 510301, 9949761440.
పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 11-10-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.J.Ramesh,
Advocate, Ananthapuram.
Cell:9985170697

NOTICE
IN THE COURT OF PRL, DISTRICT JUDGE:: GUNTUR
IA No. 1589/2024 IN IA No. 1935/2023
IN UNNUMBERED AS No. /2023
Between:
1. Varikuti Rattaiah (died)
2. Ravalisetty @ Varikuti Devi Prasunamba .... Petitioners/Appellants
AND
Dr.T.Thakur Singh @ Sagarwala Takur Singh S/o. Chandra Singh
R/o. Door No.16/18, Asmangadh, Andhra Bank Colony, Dilsukh Nagar, Hyderabad.
... Respondent/Respondent/Defendant
ఈ నంబర్ పిటిషన్ లో రెస్పాండెంటు అయిన మీకు ఎన్ని సార్లు నోటీస్ పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మిమ్మల్ని సబ్ స్టిట్యూట్ సర్వీస్ చేయించి ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసు పంపుటకు గాను ఆర్డర్ చేసియున్నారు. కావున ది:07-10-2025 తారీఖున ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా : 07-10-2025
పి.శ్రీహరిరావు
పిటిషనరు/అప్పిలెంట్ తరుపు న్యాయవాది
గుంటూరు. సెల్ నెం: 9959537981

ఆరోగ్య సమాజ నిర్మాణం సాధ్యం

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోగులు, వారి కుటుంబసభ్యులు, వైద్య సిబ్బంది అందరూ కలసి ముందుకు సాగితేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. సోమవారం హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో క్రానిక్ మైలాయిడ్ ల్యూకేమియా (సీఎంఎల్) డే వేడుకలు నిర్వహించారు. వేడుకలను ప్రారంభించిన అనంతరం బీరప్ప మాట్లాడుతూ... అవగాహన కార్యక్రమాలు వైద్యరంగానికే కాకుండా సమాజానికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ధైర్యాన్ని ఇస్తాయని చెప్పారు. మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు గుండేటి మాట్లాడుతూ క్రానిక్ మైలాయిడ్ ల్యూకేమియాపై అపోహలు పెట్టుకోకుండా, సమయానికి వైద్యపరీక్షలు చేయించుకోవడం ద్వారా దీని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. మాక్స్ ఫౌండేషన్ సహకారంతో రోగులకు ఉచితంగా ప్రాణరక్షక ఔషధాలు అందిస్తున్నట్టు తెలిపారు. క్యాన్సర్ వంటి వ్యాధులను తొందరగా గుర్తించడం, సరైన చికిత్స అందించడం ద్వారా రోగుల జీవనావకాశాలు గణనీయంగా పెంచుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా 150 మందికిపైగా క్రానిక్ మైలాయిడ్ ల్యూకేమియా రోగులు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ 'ఈవాల్వ్' పదో ఎడిషన్ ఏర్పాటు

విజయవాడ : ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ ఎంఎస్ఎంఇల కోసం రూపొందించిన ప్రతిష్టాత్మక భాగస్వామ్య వేదిక 'ఈవాల్వ్' 10వ ఎడిషన్‌ను విజయవాడలో నిర్వహించినట్లు తెలిపింది. ఇది వ్యాపారవేత్తలకు తమ వ్యాపారాలను విస్తరించడానికి అవసరమైన జ్ఞానం, నెట్‌వర్కులు, వృద్ధి సాధనాలను అందిస్తుందని ఆ బ్యాంక్ పేర్కొంది. 'ఎంఎస్ఎంఇలు 10 ట్రిలియన్ ఎకానమీకి ఇంధనం' అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, పరిశ్రమ నాయకులు, పాలసీ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. భారత ఎంఎస్ఎంఇ రంగం ఎదుర్కొంటున్న అవకాశాలు, సవాళ్లపై చర్చకు వేదికగా నిలిచిందని వెల్లడించింది. ఈ కార్యక్రమంలో 150కి పైగా ఎంఎస్ఎంఇ ప్రమోటర్లు, మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారని తెలిపింది.

ఫిలిప్స్ 'పసిడి' ఆఫర్లు

న్యూఢిల్లీ : ఫిలిప్స్ హోమ్ అప్లయెన్సెస్ ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్తగా 'సోనే పే సుహాగా' క్యాంపెయిన్ ప్రారంభించినట్లు తెలిపింది. ఇందులో నెల పాటు తమ కొనుగోలుదారులకు ప్రతి గంటకు రూ.9,999 విలువైన బంగారాన్ని గెలుచుకునే అవకాశాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. అక్టోబరు 22 వరకు కొనసాగే ఈ క్యాంపెయిన్‌లో రూ.1,000 కన్నా ఎక్కువ విలువైన ఏదైనా ఫిలిప్స్ ఉత్పత్తిని ఏదైనా ఆఫ్‌లైన్ స్టోర్‌లో లేదా ఫిలిప్స్ హోమ్ అప్లయెన్సెస్ వెబ్‌సైట్‌లో కొనుగోలు చేయడం ద్వారా బంగారం గెలుచుకునే అవకాశం ఉందని ఆ కంపెనీ ప్రతినిధి పూజా బైద్ తెలిపారు.

న్యూమెరోస్ మోటార్స్ నుంచి డిప్లోస్ మాక్స్ ప్లస్ విడుదల

హైదరాబాద్ : విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ న్యూమెరోస్ మోటార్స్ కొత్తగా డిప్లోస్ మ్యాక్స్ ప్లస్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. దీని హైదరాబాద్ ఎక్స్‌షోరూం ధరను రూ.1,15,103గా నిర్ణయించింది. డిప్లోస్ మాక్స్‌లో 4 కిలోవాట్ డ్యూయల్ లిక్విడ్ ఇమర్షన్ కూల్డ్ బ్యాటరీ, 156 కి.మీ రేంజ్, గంటలకు 70 కిలోమీటర్ల టాప్ స్పీడ్‌తో ప్రయాణించగలదని ఆ కంపెనీ పేర్కొంది.

34 శాతమే బోనస్ ఇవ్వడమేంటి?

- సింగరేణి కార్మికులకు ఇది చేదు కబురు
- వారి పక్షాన కొట్లాడుతాం : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కార్మికులకిచ్చే బోనస్‌ను రేవంత్‌రెడ్డి సర్కారు బోగస్ చేసిందనీ, కార్మికులకిచ్చే లాభాల్లో 50 శాతానికిపైగా కోత విధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రూ. 6394 కోట్ల లాభాలు గడిస్తే కేవలం రూ. 2360 కోట్లలో 34 శాతం బోనస్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. దసరా పండుగ పూట సింగరేణి కార్మికులకు ఇది తీపి వార్త కాదనీ, చేదు కబురని విమర్శించారు. సమైక్యరాష్ట్రంలోనైనా, ఇప్పుడైనా సింగరేణి కార్మికులకు ద్రోహం చేసిన పార్టీ కాంగ్రెస్సేనని ఆరోపించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నికర లాభాల్లో 34 శాతాన్ని బోనస్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లాభాల వాటాలో 50శాతం కోత విధిస్తూ కార్మికులకు చేసిన అన్యాయాన్ని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ఖండిస్తున్నామని తెలిపారు. గతేడాది సింగరేణి భవిష్యత్ ప్రణాళిక కోసమని పక్కనబెట్టిన రూ.2,283 కోట్లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి అని పేర్కొన్నారు. ఇప్పుడు రూ.4034 కోట్ల సింగరేణి సొమ్ముకు ఎసరు పెట్టారని ఆరోపించారు. కార్మికులకు రావాల్సిన వాటా ఎవరి జేబులకు మళ్లిస్తున్నారని ప్రశ్నించారు. సింగరేణి సంస్థను లాభాల బాట పట్టించింది కెసిఆరేనని అని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు న్యాయం దక్కే దాకా పోరాటం చేస్తామని ప్రకటించారు.

పేదల పట్ల కనికరం లేదా..?

- ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం ఆగదు : పోతినేని
- కొమరం భీం వాసులకు ఇళ్ల స్థలాలివ్వాలని పాల్వంచలో పాదయాత్ర
- కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

పాదయాత్ర చేస్తున్న నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పేదల పట్ల ప్రజా ప్రతినిధులకు కనికరం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని కొమరం భీం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళు మంజూరు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు 15 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ముందుగా కాలనీలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని ఇల్లు ఇవ్వాలని నినాదాలు చేస్తూ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. కొమరం భీం కాలనీ వాసులకు ఇళ్ల స్థలాలు దక్కేవరకూ పోరాటం ఆగదన్నారు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు సుడిగాలి పర్యటనలు, ప్రచార ఆర్భాటాలు తప్ప ప్రజలకు చేసిన మేలు ఏంటని ప్రశ్నించారు. గుడిసెవాసుల గోస కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఎనిమిది సంవత్సరాలుగా 450 మంది పేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని కనీస మౌలిక సదుపాయాలు లేకుండా నివాసం ఉంటే ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తామని ఆరేండ్లు కాలయాపన చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేండ్లు గడుస్తున్నా వీరి బాధలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం సెలెమెలు తవ్వకొని అవే నీళ్లు తాగుతున్నా ప్రభుత్వానికి కనీస మానవత్వం లేకుండాపోయిందని విమర్శించారు. ఈ పాదయాత్ర ద్వారా అయినా జిల్లా మంత్రులకు ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కొమరం భీం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఎర్రజెండా అండగా ఉంటుందని, వారికి ఇళ్ల స్థలాలు దక్కేవరకు ఎంతటి పోరాటానికైనా వెనకాడబోమని తెలిపారు. అనంతరం ఒఎస్‌డి వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఎజె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి జూపల్లికి కెజికెఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్లుగీత కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం (కెజికెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ, ఉపాధ్యక్షులు వి.వెంకటనర్సయ్య, కార్యదర్శి రమేష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు ఎన్.ఆశన్నగౌడ్, జి.జంగన్న, కృష్ణగౌడ్ హైదరాబాద్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. వృత్తిలో ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నందున గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన వారికి మూడేళ్ల నుండి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా రూ.12.60 కోట్లను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో నీరా తాటి ఉత్పత్తుల పరిశ్రమను ప్రారంభించాలని కోరారు. 50 ఏళ్లకు పైబడిన గీత కార్మికులందరికీ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదెకరాల చొప్పున భూమి ఇవ్వాలని, నూతన గ్రామపంచాయతీల్లో కొత్త కల్లు షాపులు మంజూరు చేయాలని, అర్హులైన వారికి కొత్త లైసెన్సులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మద్యం షాపు టెండర్లలో 25 శాతం సొసైటీలకే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఎంసిహెచ్‌లో గర్భిణి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ కేంద్రంలోని ఎంసిహెచ్ ఆస్పత్రిలో నిండు గర్భిణికి సరైన వైద్యం అందక మృతిచెందారు. వైద్యుల నిర్లక్ష్యమే ఆమె మృతికి కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ నియోజకవర్గం రావులపల్లికి చెందిన అఖిల (23)ను కర్ణాటకలోని యానగుంది ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌తో వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉన్నారు. అఖిల రెండోసారి కాన్పు కోసం తల్లిగారి ఊరు అయిన రావులపల్లికి వచ్చారు. ఆదివారం ఆమెకు నొప్పులు రావడంతో తాండూరులోని మాతా శిశు సంక్షేమ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సోమవారం తెల్లవారుజామున కడుపులో బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబీకులకు వైద్యులు సూచించిన కొద్దిసేపటికే అఖిల మృతి చెందారు. అయితే అఖిల డెలివరి విషయంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని కుటుంబ సభ్యులు వైద్యులతో వాదనకు దిగారు. అఖిల మృతికి వైద్యులే కారణమని, నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.

హైదరాబాద్‌లో సిడికె విస్తరణ

హైదరాబాద్ : ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన సిడికె హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి అదనంగా 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆ సంస్థ సోమవారం ప్రకటించింది. ఈ విస్తరణ ఉత్తర అమెరికాలో తమ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి అవసరమైన నైపుణ్యం, సాంకేతికతపై పెట్టుబడి పెట్టడానికి సిడికెకు ఉన్న నిబద్ధతను నొక్కి చెబుతోందని సిడికె ఇండియా ఎండి సందీప్ కుమార్ జైన్ తెలిపారు. మాదాపూర్‌లోని రహేజా మైండ్‌స్పేస్‌లో ఉన్న ఈ కేంద్రం, ఉత్పత్తిని వేగవంతం చేయడంతో పాటు వినియోగదారులకు మరింత సేవలను అందించనుందన్నారు.

పామాయిల్ కర్మాగారంతో..
రైతుల జీవితాల్లో గుణాత్మకమైన మార్పు

- బిఆర్ఎస్ కష్టంతోనే ఫ్యాక్టరీ
- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేలాదిమంది రైతుల జీవితంలో ఆయిల్ పామ్ కర్మాగారం గుణాత్మకమైన మార్పు తీసుకువచ్చి, దశ దిశను మారుస్తోందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో నూతనంగా నిర్మించిన పామాయిల్ కర్మాగారం ట్రయల్ రన్ విజయవంతమైన నేపథ్యంలో సోమవారం కర్మాగారాన్ని ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎఫ్‌డిసి మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇతర బిఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామ్ ఆయిల్ కర్మాగారం కల సాకారమవడం గొప్ప విజయమన్నారు. అందరి దృష్టిలో ఇది కర్మాగారం అయితే ఈ ప్రాంత రైతుల దృష్టిలో ఇది ఒక భావోద్వేగమని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల తెలంగాణలో సాగునీటికి ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. సిద్ధిపేటకు పామాయిల్ పంట తీసుకొద్దామని ప్రయత్నం చేసిన తొలినాళ్లలో ఇక్కడ ఆయిల్ పామ్ సాగు సాధ్యం కాదన్నారని, గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటమే కారణమని చెప్పారని తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రీసెర్చ్ (ఐఐఒఆర్) వారు చెబితే తప్ప ఇక్కడ పామాయిల్ సాగు చేయలేమని అధికారులు చెప్పారన్నారు. కానీ కెసిఆర్ చేపట్టిన ప్రాజెక్టుల వల్ల పామాయిల్ పంట సాగుకు అనుకూలంగా మారిందని తెలిపారు. 2019లో అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్‌తోపాటు చెరువులు, చెక్ డ్యాంల్లో నీళ్లు నింపినట్టు తెలిపారు. ఐఐఒఆర్ 2021లో పరిశోధన చేసి గాలిలో తేమ శాతం పెరిగిందని ఇక్కడ పామాయిల్ సాగు చేసుకోవచ్చని ప్రకటించిందన్నారు. ఆయిల్ పామ్ సాగు లాభసాటిగా మారి రైతుకు ప్రతినెల జీతం పడినట్లు ఆదాయం వస్తుందని చెప్పారు. చుట్టుపక్కల ఐదు జిల్లాల రైతులకు ఈ కర్మాగారం వరప్రదాయిని కాబోతోందన్నారు.

ఆయిల్ పామ్ కర్మాగారాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న హరీశ్ రావు

విత్తనం నాటింది బీఆర్ఎస్.. ఫలాలు తింటున్నది కాంగ్రెస్..

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో పామ్ ఆయిల్ తోటలతో విత్తనం నాటడంతో పాటు కర్మాగారానికి పునాది వేసింది బిఆర్ఎస్ అయితే ఫలాలు తినడానికి మాత్రం కాంగ్రెస్ వాళ్లు బయలుదేరారని హరీశ్‌రావు అన్నారు. ఈ కర్మాగారం రావడం వెనుక కష్టం ఎవరిది? తంటాలు పడింది ఎవరనేది ప్రజలకు తెలుసన్నారు. తాము పడ్డ కష్టానికి ఫలితం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణంలో ఏమాత్రం కష్టపడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రిబ్బను కత్తిరించడానికి కత్తెర జేబులో పెట్టుకొని బయలుదేరారన్నారు. పామాయిల్ తోటల్లో కోకో పంటల సాగు వైపు అడుగులు వేయాలని సూచించారు.

కెజిబివి కార్మికుల అరెస్టులు అక్రమం

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల (కెజిబివి) నాన్‌టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ కార్మికులను అక్రమంగా అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రగతిశీల కెజిబివి నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ కార్మికుల డిమాండ్ల సాధనకు కోసం 'సెప్టెంబర్ 22 చలో ఎస్‌పిడి కార్యాలయం' పిలుపును భగ్నం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. దీన్ని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేయాలని, కుక్, స్వీపర్, స్కావెంజర్, వాచ్ ఉమెన్ పోస్టులకు పదో తరగతి విద్యార్హత నిబంధన తొలగించాలని వారు కోరటం నేరమా? అని ప్రశ్నించారు. పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ కల్పించాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఇవ్వాలనే డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా జరప తలపెట్టిన కార్యక్రమాన్ని భగ్నం చేయాలనుకోవడం తగదని హితవు పలికారు.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఎక్సైజ్ శాఖ కన్నెర్ర

- ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీముల దాడులు
- వారం రోజుల్లో రూ.68.16 లక్షల మద్యం సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి అక్రమంగా రవాణ అవుతున్న మద్యంపై ఎక్సైజ్ శాఖ కన్నెర్ర చేసింది. ఈ నెల 15 నుంచి 30 వరకు ఎన్‌డిపిఎల్, నాటుసారా తయారీ, అమ్మకాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అబ్కారీ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున దాడులు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో వారం రోజుల్లో రూ.68.16 లక్షల విలువ గల 1,704 మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత మూడేళ్లలో ఎన్‌డిపిఎల్ పట్టుకున్న నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌తో పోలిస్తే వారం రోజుల్లో పట్టుకున్న మద్యం ఎక్కువగా ఉంది. పదేళ్లలో తెలంగాణలో 4,516 కేసులు నమోదు చేసి 3,238 మందిని అరెస్టు చేసి 1,22,222 లీటర్ల (16,300)మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. 2024లో 955 కేసుల్లో 513 మందిని అరెస్టు చేసి 12,807 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఏడాది ఆగస్టు నాటికి 644 కేసుల్లో 381 మందిపై కేసు నమోదు చేసి, 8201 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. కానీ వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 1,704 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. మరో వారం పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక దాడులు కొనసాగుతాయని తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం తెలిపారు.

అసెంబ్లీ ఆవరణలో బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అందులో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్‌ముదిరాజ్, శాసనమండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్‌సి అభివృద్ధి శాఖలో 1,392 పోస్టుల కొనసాగించేందుకు ఆమోదం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖలో వివిధ కేటగిరీలకు చెందిన 1,392 పోస్టులకు మరో ఏడాది పాటు సేవలను కొనసాగించేందుకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రకటన జారీ చేశారు. దీంతో రాష్ట్రంలో హాస్టళ్లు, ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ వసతిగృహాలు, ప్రత్యేక న్యాయస్థానాలు, జిల్లా కార్యాలయాల్లో సేవలు మరింత బలోపేతం కానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ దృక్పథానికి ఈ జీవో సాక్ష్యమని తెలిపారు. హాస్టళ్లలో సిబ్బంది లోటు భర్తీ కావడంతో విద్యార్థుల వసతి, ఆహారం, విద్య, భద్రత అన్ని రంగాల్లో నాణ్యత పెరుగుతుందని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనున్నదని తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం సమాజంలోని అణగారిన, బలహీన వర్గాల శ్రేయస్సు, భవిష్యత్తు నిర్మాణం కోసమేనని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విజయపథంలో ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు.

వైద్యులపై దాడులు సరికాదు : టిజిజిడిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోగులు మరణిస్తే ప్రతిసారి వైద్యులను బాధ్యులను చేస్తూ దాడులు చేయడం సరికాదని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజిజిడిఎ) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎం.కే. రవూఫ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబాబాద్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌పై జరిగిన సామూహిక దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దారుణ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యులు దేవుళ్లు కారని, ప్రతి రోగి ప్రాణాన్ని కాపాడేందుకు వైద్యులు ఎల్లప్పుడూ తమ వంతు కృషి చేస్తారని తెలిపారు. ఎటువంటి వైద్యుడు కూడా ఉద్దేశపూర్వకంగా హాని చేయడం లేదని గుర్తుచేశారు. ఇలాంటి హింసాత్మక చర్యలు సమాజానికి హానికరం, వైద్య సేవలకు అంకితభావంతో పని చేసే డాక్టర్లను తీవ్రంగా నిరుత్సాహ పరుస్తాయని తెలిపారు.

మాజీ డిఎస్‌పి నళిని ఆరోగ్యంపై ప్రభుత్వం ఆరా

- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరామర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమ సమయంలో తన ఉద్యోగానికి రాజీనామా చేసిన మాజీ డిఎస్‌పి నళినికి సహాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. 'ఇదే నా మరణ వాంగ్మూలం' అంటూ ఆమె ఇటీవల బహిరంగ లేఖ రాసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నళినితో పాటు ఆమె కుటుంబ సభ్యులను కలెక్టర్ కలిశారు. నిబంధనల మేరకు సర్వీస్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్న సిఎం సందేశాన్ని ఆమెకు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అవసరం అయితే నిమ్స్, లేదా ఇతర కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎంత ఖర్చైనా నళినికి వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ వెల్లడించారు. గతంలో ఆమె వైద్యం కోసం చేసిన ఖర్చులను సైతం సిఎం రిలీఫ్ ఫండ్ కింద చెల్లిస్తామని రేవంత్ చెప్పారని అన్నారు.

నల్గొండలో ఏథర్ ఎలక్ట్రిక్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

విటి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నల్గొండలోని విద్యుత్ కాలనీ, మరిగూడ వద్ద ఏథర్ ఎలక్ట్రిక్ షోరూమ్‌ను ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ జోనల్ హెడ్ మురళీ కృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షోరూమ్‌లో కంపెనీ తాజా ఎలక్ట్రిక్ వాహన మోడల్స్ అన్నీ ఉన్నాయన్నారు. ఇందులో ఇటీవల విడుదలైన జెన్-5 450 సిరీస్, ఫ్యామిలీ స్కూటర్ రిజ్టా మోడల్స్ కూడా లభిస్తాయన్నారు. ఓపెనింగ్ సందర్భంగా రూ.18,500 వరకూ పండుగ ఆఫర్లు, ప్రత్యేక రాయితీలను కల్పిస్తున్నామన్నారు. ఈ కొత్త రిటైల్ షోరూమ్ ప్రారంభం ద్వారా ఏథర్ ఎనర్జీ తెలంగాణలోని నల్గొండ జిల్లా వరకు తన వ్యాపార విస్తరణలో ఒక కీలకమైన మైలురాయిని చేరుకుందన్నారు. విటి ఆటోమోటివ్స్ ఎమ్‌డి తేజ పవన్ కుమార్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో మాకు ఒక ఏథర్ షోరూమ్ ఉందన్నారు. మా పని తీరు నచ్చి నల్గొండలో మరో అవకాశం ఇచ్చారన్నారు. దసరా సీజన్‌లో కస్టమర్ల కోసం ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయన్నారు.

'బిఎఎస్ఎల్‌పి' కళాశాలలపై చర్యలు

- ఎన్‌పిఆర్‌డి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిహబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సిఐ) అనుమతి లేకుండా బ్యాచులర్ ఆఫ్ ఆడియాలజి అండ్ స్పీచ్ లాంగ్వేజీ పాథాలాజి కోర్స్ నడుపుతున్న ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్ 2016 ఆర్‌పిడబ్ల్యూడి రాష్ట్ర కమిషనర్, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో రెండు, ప్రయివేట్ రంగంలో మూడు కళాశాలల్లో రిహబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి లేకుండానే ఆడియాలజి కోర్సులను నడుపుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాలలు, కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాల, ప్రతిమ రిలీఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్స్ హన్మకొండ, మహబూబ్‌నగర్‌లోని ఎస్‌విఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్ కళాశాలలు ఆర్‌సిఐ అనుమతి లేకుండానే మూడేండ్ల నుండి బ్యాచ్‌లర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజీ పాథలాజి కోర్సులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

బిడ్డతో సహా భార్య ఆత్మహత్య

- కాపాడేందుకు ప్రయత్నించిన భర్తకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పొట్టకూటి కోసం ఉపాధి వెతుక్కుంటూ వచ్చిన కుటుంబం కలహాల కారణంగా చిన్నాభిన్నమైంది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ ఏడాది వయసున్న పాపతో పాటు తల్లి ఆత్మహత్యకు కారణమైంది. మరో ముగ్గురు ఆడ పిల్లలు తల్లి ప్రేమకు దూరమయ్యారు. జీఆర్‌పి ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన జగత్‌రాం, స్వప్న(27) భార్యాభర్తలు. వీరికి నలుగురు ఆడపిల్లలు సంతానం. 20 రోజుల కిందటే వీరు కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్-ఈజ్‌గాం రహదారిలో చింతగూడకు వెళ్లే రైల్వే గేటు సమీపంలోని ఇటుక బట్టీలో పని చేసేందుకు వచ్చారు. అయితే, భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కూడా వీరి మధ్య గొడవ జరగడంతో స్వప్న తన 11 నెలల పాప జాస్మితో కలిసి రైల్వే ట్రాక్‌పైకి వెళ్లింది. అదే సమయంలో రైలు రావడంతో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె చేతిలోని పాప జాస్మి ఎగిరి దూరంగా పడి ప్రాణం విడిచింది. వీరిద్దరినీ కాపాడేందుకు వెళ్లిన భర్త జగత్‌రాం తీవ్రంగా గాయపడ్డాడు. జగత్‌రాంను రైల్వే పోలీసులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్సల అనంతరం మంచిర్యాలకు తరలించారు. మృతుల సంబంధీకులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి రావాల్సి ఉందని, వారు వచ్చిన తర్వాత కేసు వివరాలు మరింతగా తెలిసే అవకాశముందని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎల్ లక్సీ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ పోటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోని ప్రొఫెషనల్ గోల్ఫ్ అధికారిక అనుమతి సంస్థ అయిన ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ) సోమవారం ఎన్ఎస్ఎల్ లక్సీ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 2025ను ప్రకటించింది. ఈ మేరకు పోటీలు సెప్టెంబర్ 23 నుంచి 26వ తేదీ వరకు హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ (హెచ్‌జిఎ)లో జరగనున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఈవెంట్‌లోని విజేతకు ప్రైజ్‌మనీ ఒక కోటి ప్రకటించినట్లు తెలిపారు. 123 మంది గోల్ఫర్లు పాల్గొనే ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ప్రెజెంటింగ్ పార్టనర్‌గా ఎన్ఎస్ఎల్ లక్సీ, అసోసియేట్ పార్టనర్ తెలంగాణ టూరిజం, హాస్పిటాలిటీ పార్టనర్ ది వెస్టిన్ హైదరాబాద్ మైండ్‌స్పేస్‌తో పాటు హోస్ట్ వెన్యూ హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు. 2015లో ప్రారంభమైనప్పటి నుంచి తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తోంది.